# సెప్టెంబరులో 2011 గ్రూపు-I మెయిన్స్

**ఈనాడు, హైదరాబాద్:** సుప్రీంకోర్టు ఆదేశాలతో గ్రూపు-2011 నోటిఫికేషన్ అనుసరించి మెయిన్స్ పరీక్షల్ని సెప్టెంబరు మొదటి, రెండో వారంలో నిర్వహించాలని ఏపీపీఎస్సీ యోచిస్తోంది. ప్రిలిమ్స్ ప్రశ్నపత్రాల్లో తప్పులు దొర్లడంతో, సరిచేసిన 'కీ' అనుసరించి మెయిన్స్‌కు అభ్యర్థులను ఎంపిక చేసి పరీక్షలు నిర్వహించాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. ఆ నోటిఫికేషన్ అనుసరించి ఇంటర్వ్యూలు పూర్తి చేసి, ఫలితాల విడుదలకు చర్యలు మొదలయ్యే సమయంలో పరిస్థితులు తారుమారయ్యాయి. సుప్రీంకోర్టు ఆదేశాల్ని అనుసరించి మూడునెలల్లోగా ఈ నియామక ప్రక్రియను ఏపీపీఎస్సీ పూర్తిచేయాల్సి ఉంది.

**ఇంకా అందని ఉద్యోగాల సమాచారం:** రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించిన ఉద్యోగాల భర్తీకి సంబంధించిన వివరాలు ఏపీపీఎస్సీకి ఇంకా అందలేదు. గ్రూపు-2 పరీక్షల్ని ప్రిలిమ్స్, మెయిన్స్ విధానంలో నిర్వహించే విషయంపైనా ప్రభుత్వ స్థాయిలో నిర్ణయం తీసుకోలేదు. గ్రూపు-2 పోస్టుల్ని గ్రూపు-1లో విలీనం చేయొద్దని అభ్యర్థుల కోరికకు సానుకూలంగా స్పందించిన ఏపీపీఎస్సీ ప్రభుత్వానికి లేఖ రాసింది. దీనిపైనా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

**తెలంగాణలో 25 నుంచి వైద్యవిద్య ప్రవేశాలకు ధ్రువపత్రాల పరిశీలన:** తెలంగాణలోని ప్రభుత్వ, ప్రైవేటు వైద్య కళాశాలల్లో కన్వీనర్ కోటాలో భర్తీ చేయనున్న ఎంబీబీఎస్, బీడీఎస్ వైద్యవిద్య సీట్ల ప్రవేశాల కోసం విద్యార్థుల ధ్రువపత్రాల పరిశీలన ప్రక్రియను ఈనెల 25 నుంచి నిర్వహించనున్నట్లు కాళోజీ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ కరుణాకరరెడ్డితెలిపారు. ఈనెల 25 నుంచి 30 వరకూ జనరల్ కేటగిరీలో విద్యార్థుల ధ్రువపత్రాలను, 31, వచ్చేనెల 1, 2 తేదీల్లో వికలాంగులు, ఆర్మీ, క్రీడా, పోలీసు అమరవీరుల పిల్లలు.. తదితర ప్రత్యేక కేటగిరీల విద్యార్థుల ధ్రువపత్రాలను పరిశీలిస్తామన్నారు. ఇందుకోసం తెలంగాణలో జేఎన్‌టీయూ, ఉస్మానియా విశ్వవిద్యాలయం, కాకతీయ విశ్వవిద్యాలయం కేంద్రాలతో పాటు విజయవాడలో ఎన్టీఆర్ ఆరోగ్యవర్సిటీలోనూ కేంద్రాలను ఏర్పాటుచేసినట్లు ఆయన తెలిపారు. ప్రవేశాల ప్రక్రియను మాత్రం ఆగస్టు 10వ తేదీ తర్వాతే చేసే అవకాశాలున్నట్లు ఆరోగ్య వర్సిటీ వర్గాలు తెలిపాయి. జులై 24న నీట్ పరీక్ష పూర్తయితే.. వచ్చేనెల 9 వరకూ అభ్యంతరాల స్వీకరణకు గడువు ఇచ్చిందనీ, నీట్ ఫలితాలు కూడా 10వ తేదీ తర్వాతే వస్తాయి కాబట్టి.. తెలంగాణలో కౌన్సెలింగ్‌ను ఆ తేదీ తర్వాతే నిర్వహించాలని యోచిస్తున్నట్లు పేర్కొన్నాయి. కౌన్సెలింగ్ తేదీలను ధ్రువపత్రాల పరిశీలన అనంతరం ప్రకటిస్తారని తెలుస్తోంది.

## ఏఐసీటీఈ కళాశాలల్లో..

## ఇతర బోర్డుల కోర్సులకు అనుమతి

**ఈనాడు, దిల్లీ:** అఖిల భారత సాంకేతిక విద్యా మండలి (ఏఐసీటీఈ) అనుమతితో కొనసాగుతున్న కళాశాలల్లో... మరో నియంత్రణ మండలి పరిధిలోకి వచ్చే కోర్సుల నిర్వహణకు అనుమతిస్తూ కేంద్రం సోమవారం ఉత్తర్వులు జారీచేసింది. ఏఐసీటీఈ నిబంధనలు-2012లోని సెక్షన్ 4.1కి సవరణ చేసినట్లు వెల్లడించింది. ఏఐసీటీఈ అనుమతి ద్వారా వేరే నియంత్రణ సంస్థ పరిధిలోకి వచ్చే కోర్సులు నిర్వహించుకోవచ్చని స్పష్టంచేసింది. అయితే రెండు నియంత్రణ సంస్థలు నిర్దేశించిన నిబంధనలు, ప్రమాణాలకు ఏమాత్రం విఘాతం కలిగించకూడదని సూచించింది. ఇంకా విద్య నాణ్యతా ప్రమాణాలు దెబ్బతినకూడదని షరతు విధించింది. ఈ ఉత్తర్వులు సోమవారం రాత్రి నుంచే అమలులోకి వస్తున్నట్లు పేర్కొంది. ప్రస్తుతం ఇంజినీరింగ్, పాలిటెక్నిక్, ఆర్కిటెక్చర్, ఫార్మసీ, హోటల్ మేనేజ్‌మెంట్, కేటరింగ్ టెక్నాలజీ, ఎంబీఏ, ఎంసీఏ కోర్సులకు ఏఐసీటీఈ అనుమతులు ఇస్తోంది.